క్లుప్తంగా

నేడు ఉచిత వైద్యశిబిరం

గుంటూరు మెడికల్: లివర్ సమస్యలను ప్రాథమిక దశలోనే గుర్తించేందుకు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు డయాబెటాలజిస్ట్, గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ షేక్ నాగూర్ బాష బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక గుంటూరు వారి తోట 7వ లైన్‌లోని కేర్ వెల్ హాస్పిటల్‌లో గురువారం ఉచిత వైద్య శిబిరం జరుగుతుందని పేర్కొన్నారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే శిబిరంలో ఒక్కో రోగికి సుమారు రూ.10 వేల ఖరీదు చేసే ఫైబ్రో స్కాన్ ఉచితంగా చేస్తున్నామని వెల్లడించారు. అవకాశాన్ని పేదలు ఉపయోగించుకోవాలని హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ షేక్ గౌస్‌బాషా తెలిపారు. వైద్య పరీక్షలు చేయించుకునేవారు ముందుస్తుగా 8341713713, 9854757999 నంబర్లను సంప్రదించాలని పేర్కొన్నారు.

నర్సింగ్ సూపరింటెండెంట్‌గా ఆషాసజని



గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ గ్రేడ్–1 నర్సింగ్ సూపరింటెండెంట్‌గా కె.ఆషా సజని బుధవారం విధుల్లో చేరారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నీలం ప్రభావతిని కలిసి జాయినింగ్ ఉత్తర్వులు అందజేశారు. కొత్తగా విధుల్లో చేరిన ఆషా సజనిని ప్రభావతి అభినందించారు. అనంతరం ఆషా సజనిని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నర్సుల సంఘం గుంటూరు జీజీహెచ్ శాఖ నేతలు శ్రీదేవి, రాజ్యలక్ష్మి, పద్మావతి, జిల్లా నేతలు వెల్లంపల్లి పద్మజ, ఆవుల విజయ, రోజ్‌రాణి, గ్రేడ్–2 నర్సింగ్ సూపరింటెండెంట్‌లు పద్మ, షమీనా బేగం, కిరణ్మయి తదితరులు ఘనంగా సన్మానించారు.

నంబర్ ప్లేటు లేని 42 వాహనాలు సీజ్



పట్నంబజారు: నంబర్ ప్లేటు లేకుండా వాహనాలు నడిపితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఈస్ట్ ట్రాఫిక్ సీఐ నిసార్‌బాషా హెచ్చరించారు. ఈ మేరకు బుధవారం ఈస్ట్ పరిధిలోని ఆర్టీసీ బస్టాండ్, బీఆర్ స్టేడియం, నాజ్‌సెంటర్‌తోపాటు ముఖ్య కూడళ్లలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. 42 వాహనాలు నంబర్ ప్లేట్లు లేకుండా తిరుగుతున్నట్టు గుర్తించి సీజ్ చేశారు. సీఐ నిసార్‌బాషా మాట్లాడుతూ ఇటీవల నంబరు ప్లేట్లు లేకుండా వాహనాలు తిరుగుతున్న పరిస్థితులు అధికంగా కనపడుతున్నాయని వివరించారు. ఇటువంటి వాహనాలతోనే పలు నేరాలు జరిగే పరిస్థితులు లేకపోలేదని పేర్కొన్నారు. అనుమానాస్పదంగా ఉన్న వాహనాలను పూర్తిస్థాయిలో పరిశీలించిన అనంతరం విడిచిపెడతామని వివరించారు. మైనర్లు ద్విచక్ర వాహనాలు నడుపుతున్న క్రమంలో తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించామన్నారు. దీనిపై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని, నిబంధనలు పాటించని వాహనాలను సీజ్ చేసి చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

నలుగురు ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు

గుంటూరు ఎడ్యుకేషన్: విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన నలుగురు ఉపాధ్యాయులకు డీఈఓ పి.శైలజ షోకాజ్ నోటీసులు జారీ చేశారు. బుధవారం రైలుపేటలోని నగరపాలకసంస్థ ప్రాథమిక పాఠశాల (నంబరు–28)ను సందర్శించిన డీఈఓ శైలజ విద్యార్థుల్లోని అభ్యసన సామర్థ్యాలతోపాటు వర్క్‌బుక్స్‌ను పరిశీలించారు. వర్క్‌బుక్స్‌ను రోజూ పరిశీలించకపోవడం, విద్యార్థుల్లో నిర్దేశిత ప్రమాణాలను పెంపొందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో సంజాయిషీ కోరుతూ ఎస్జీటీలు వి.శ్రీనివాసరావు, టి.ఫిలిప్‌రాజు, టి.మానస, వీవీ ఉమామహేశ్వరరావు నుంచి డీఈఓ సంజాయిషీ కోరారు. అనంతరం రైలుపేటలోని ఎస్జీఎన్‌కే బాలికోన్నత పాఠశాలను సందర్శించిన ఆమె టెన్త్ విద్యార్థినుల సామర్థ్యాలను పరిశీలించారు. పబ్లిక్ పరీక్షలపై సూచనలు చేశారు. డీఈఓ వెంట ఎంఈఓ అబ్దుల్ ఖుద్దూస్ ఉన్నారు.

దళితులపై దాడి చేసిన వారిని శిక్షించాలి

నెహ్రూనగర్: బాపట్ల జిల్లా కొల్లూరు మండలం చింతలంక, పెదలంక దళితులపై అగ్రకులానికి చెందిన వారు దాడి చేయడం బాధాకరమని, వెంటనే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్వర్ణాంధ్ర ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు ఏసుబాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు నగరంలోని సంఘ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఏసుబాబు మాట్లాడుతూ భూమిని సాగుచేసుకుంటున్న దళితులపై దాడి చేయడం హేయమైన చర్యని పేర్కొన్నారు. బాధితులకు తగిన న్యాయం చేయడంతోపాటు బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

● సత్యదేవ జయతే



సత్యనారాయణ స్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

పాత గుంటూరు: బ్రాడీపేటలోని సిద్ధేశ్వరీ పీఠ పాలిత ఓంకారక్షేత్రంలో సీతారామాంజనేయ నగర సంకీర్తన సంఘం ఆధ్వర్యంలో 89వ శ్రీరామనామ సప్తాహ మహోత్సవాలు, 93వ సంఘ వార్షికోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. బుధవారం భీష్మ ఏకాదశి సందర్భంగా ఓంకారేశ్వరస్వామికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. చివరిగా రమా సహిత సత్యనారాయణస్వామి కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. ముత్యాల తలంబ్రాలు, మహా హారతి, మంత్రపుష్పం, ఆశీర్వాదం అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందించారు. ఇందుమతి భక్తి సంగీతం, మంచికంటి వెంకట సత్యవతి శ్రీమద్రామాయణం విశేషాలతో ప్రవచనం చేశారు. ఆలయ పాలకమండలి సత్యవతిని సత్కరించారు. అనంతరం రమా సహిత సత్యనారాయణస్వామి సామూహిక వ్రతాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యదర్శి నంబూరి శ్రీవేంకటనారాయణమూర్తి పర్యవేక్షించారు.

● మాతా కటాక్షించండీ



చండీ హోమం నిర్వహిస్తున్న అర్చకులు

పాత గుంటూరు: అరండల్‌పేట 4వలైనులోని హంపి విద్యారణ్య పీఠ పాలిత గంగా మీనాక్షి సోమసుందరేశ్వర స్వామి దేవస్థానంలో ప్రతిష్ఠ జరిగి 120 ఏళ్లు నిండిన సందర్భంగా సహస్ర కలశాభిషేక ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా బుధవారం యాగబ్రహ్మ గుంటూరు కాశీ పర్యవేక్షణలో నవ చండీహోమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. లలితా సహస్రనామ పారాయణం, కుంకుమ పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు కుందుర్తి భాస్కర శర్మ, కుందుర్తి సుబ్రహ్మణ్య శర్మ, మధు శర్మ, ధూళిపాళ్ల భాస్కర్, సిరిపురపు శ్రీధర్, దారపునేని శివప్రసాద్, భక్తులు పాల్గొన్నారు. భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేశారు.

జగనన్న కాలనీల్లో నిర్మాణాలు వేగవంతం కావాలి

- ఉగాది నాటికి ప్రతి లేఅవుట్‌లో గృహప్రవేశాలు జరగాలి
- నగరపాలక సంస్థ కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశం



సీసీ డ్రెయిన్ కొలతలను దగ్గరుండి పరిశీలిస్తున్న కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని, హౌసింగ్, నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారులను నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశించారు. బుధవారం నగరపాలక సంస్థ కాన్ఫరెన్స్ హాల్లో ఇంజినీరింగ్, హౌసింగ్ డిపార్ట్‌మెంట్ అధికారులతో జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణ పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఉగాది నాటికి ప్రతి లే అవుట్‌లో ఇళ్లను గృహప్రవేశాలకు సిద్ధం చేసేలా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలన్నారు. జగనన్న కాలనీల్లో అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తున్నామని, లబ్ధిదారులు ఇళ్ళ నిర్మాణం చేసుకునేలా సచివాలయ కార్యదర్శులు, నోడల్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఇళ్ల నిర్మాణం చేస్తున్న కాంట్రాక్టర్లు పనులు వేగవంతం చేయాలని సూచించారు. ప్రతి లే అవుట్ నుంచి కాంట్రాక్టర్ రోజూ నిర్దేశిత లక్ష్యానికి అనుగుణంగా పనులు చేయాలని, నోడల్ అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. లే అవుట్‌ల వారీగా ఎప్పటికప్పుడు పనుల పురోగతిపై నివేదిక ఇవ్వాలని చెప్పారు. ఆర్డీఓ ఎం.ప్రభాకరరెడ్డి మాట్లాడుతూ నగర పరిధిలోని ప్రతి లే అవుట్‌లో మెరకకు అవసరమయ్యే గ్రావెల్ కోసం తహసీల్దార్‌లతో నోడల్ అధికారులు సమన్వయం చేసుకోవాలన్నారు. సమావేశంలో డెప్యూటీ కమిషనర్ టి.వెంకట కృష్ణయ్య, హౌసింగ్ పీడీ సాయినాద్ కుమార్, ఈఈ శంకరరావు, నగరపాలక సంస్థ ఎస్.ఈ. భాస్కర్, ఈ.ఈ.లు సుందర్రామిరెడ్డి, శాంతిరాజు, కొండారెడ్డి, కోటేశ్వరరావు, హౌసింగ్, నగరపాలక సంస్థ డీఈఈలు, ఏఈలు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత అవసరం

గుంటూరు నగరంలో రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణాలను నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా చేయాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి అధికారులను ఆదేశించారు. బుధవారం బాలాజీ నగర్‌లో రూ.25.8 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్, డ్రెయిన్, రెడ్ల బజార్, వినోభా నగర్, తమ్మా రంగారెడ్డి నగర్‌లలో రూ.28 లక్షలతో నిర్మిచిన సీసీ డ్రెయిన్లు, పాత గుంటూరులో కాపు కమ్యూనిటీ హాల్‌లో రూ.20 లక్షలతో పూర్తి చేసిన పలు పనులను కీర్తి చేకూరి పరిశీలించి, నాణ్యత, కొలతలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అభివృద్ధి పనులను అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. ఇంజినీరింగ్ అధికారులు నాణ్యతపై దృష్టిపెట్టాలన్నారు. పనుల్లో నాణ్యత లోపాలు గుర్తిస్తే కాంట్రాక్టర్‌తోపాటు ఇంజినీరింగ్ అధికారులు, ఎమినిటి కార్యదర్శులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. అగ్రిమెంట్ ప్రకారం అభివృద్ధి పనులు పక్కాగా జరగాలని, నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేసేలా ఎమినిటి కార్యదర్శులు పర్యవేక్షించాలని, రఫ్ ఎం.బుక్‌ని ఎమినిటి కార్యదర్శులే సిద్ధం చేయాలని కీర్తి చేకూరి ఆదేశించారు. పర్యటనలో కార్పొరేటర్లు పోలవరపు జ్యోతి, యర్రి ధనలక్ష్మి, మొహమూద్, ఎస్ఈ భాస్కర్, ఈఈ కోటేశ్వరరావు, డీఈఈ కళ్యాణరావు, ఏసీపీ కాలేష, టీపీఎస్ రసూల్, ఏఈ సేతుబాబు, శానిటరీ సూపర్‌వైజర్ ఆయూబ్ ఖాన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఐజాక్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి అక్రమ రవాణాపై ఉక్కుపాదం

ఎస్పీ ఆరిఫ్ హఫీజ్



నగరంపాలెం: జిల్లాలో గంజాయి అక్రమ రవాణా చేసినా, వినియోగించినా కఠినమైన చర్యలు తప్పవని ఎస్పీ కె.ఆరిఫ్‌హఫీజ్ బుధవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. సామాజిక మాధ్యమాలలో తాడేపల్లి పీఎస్‌లో నమోదైన కేసులో బ్లేడ్ బ్యాచ్‌కి, గంజాయికి ఎటువంటి సంబంధం లేదని తెలిపారు. ఆ వివాదానికి మద్యం మత్తే కారణమని పేర్కొన్నారు. రెండు రోజుల క్రితం వారందరూ మద్యం పూటుగా తాగి, ఆ మత్తులో వారి మధ్య మాటలు పెరిగి ఓ యువకునిపై బీరు సీసాతో దాడి చేశారని, దీనిపై ఫిర్యాదు అందిన వెంటనే కేసు నమోదు చేసి, అరెస్ట్ చేశారని ఎస్పీ చెప్పారు. కేసును మరింత కూలంకషంగా దర్యాప్తు చేయాలని పోలీస్ అధికారులను ఆదేశించినట్లు వెల్లడించారు. రాష్ట్ర డీజీపీ గంజాయి నిర్మూలించేందుకు పటిష్ట చర్యలు చేపట్టాలని స్పష్టమైన ఆదేశాలు గతంలో జారీచేశారని వివరించారు. దీంతో జిల్లాలో గంజాయి రవాణాను నియంత్రించడంతోపాటు అక్రమమార్కులను అరెస్ట్ చేస్తున్నట్లు తెలిపారు. తక్కువ సమయంలో ఎక్కువ ఆదాయం పొందాలనే దురాశతో కొందరు అక్రమాలకు పాల్పడుతున్నారని, వారికి చట్టపరమైన ఇబ్బందులు తప్పవని తెలిపారు. పోలీస్ ప్రత్యేక బృందాలతో విస్తృత తనిఖీలతో పాటు గంజాయి, మత్తు పదార్థాల వాడకంపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్థానిక ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ, శాంతి భద్రతలకు భంగం కలిగించే, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

ట్రాఫిక్ సీఐగా అక్కేశ్వరరావు



పట్నంబజారు: గుంటూరు వెస్ట్ ట్రాఫిక్ సీఐగా పి.అక్కేశ్వరరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. 2002 బ్యాచ్ ఎస్సైగా ఆయన విధుల్లో చేరారు. ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో సుదీర్ఘ కాలం పనిచేసిన అక్కేశ్వరరావుకు 2009లో సీఐగా పదోన్నతి లభించింది. 2013లో ఈస్ట్ ట్రాఫిక్ సీఐగా పనిచేసిన అనుభవం ఉంది. నెల్లూరు జిల్లాల్లో పలు ప్రాంతాల్లో పనిచేసిన ఆయన్ను వీఆర్ నుంచి గుంటూరు వెస్ట్ ట్రాఫిక్ సీఐగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇప్పటి వరకు స్టేషన్ సీఐగా బాధ్యతలు నిర్వహించిన ఎం.శేషగిరిరావును మరో స్టేషన్‌కు బదిలీ చేస్తూ అధికారులు ఆదేశాలు జారీ చేశారు.

ఆదిమశాస్త్రాల అధ్యయనం అవసరం



సదస్సులో సమర్పించే పరిశోధనా పత్రాల సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ రాజశేఖర్ తదితరులు

- ఏఎన్‌యూ వీసీ రాజశేఖర్
- ఫార్మసీ కళాశాల ఆధ్వర్యంలో జాతీయ సదస్సు ప్రారంభం

ఏఎన్‌యూ : ప్రపంచ వ్యాప్తంగా ఆయా దేశాలలో ఉండే ఆదిమ శాస్త్రాల అధ్యయనంతోనే ఆధునిక మనుగడ సాఫీగా సాగుతోందని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ వైస్ చాన్సలర్ పి.రాజశేఖర్ చెప్పారు. ఏఎన్‌యూ ఫార్మసీ కళాశాల ఆధ్వర్యంలో 'అడ్వాన్సెస్ ఇన్ ఫైటోమెడిసిన్ అండ్ ఫైటోనానోకాంపోజిట్స్' అనే అంశంపై రెండు రోజులపాటు నిర్వహిస్తున్న జాతీయ సదస్సు బుధవారం ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా వీసీ మాట్లాడుతూ ఫార్మసీ రంగంలో ఫైటోమెడిసిన్, ఫైటోనానోకాంపోజిట్స్ అనేవి ఆదిమ శాస్త్రాలకు సంబంధించిన సమకాలీన అంశాలని పేర్కొన్నారు. మారుతున్న పరిస్థితులు, పరిజ్ఞానానికి అనుగుణంగా వైద్యం, సైన్స్ రంగం అభివృద్ధి చెందుతున్నప్పటికీ దానికి ప్రామాణికం మాత్రం ఆదిమ శాస్త్రాలేనన్నారు. ప్రపంచంలో ప్రతి దేశంలో మొదటి జాతీయులందరూ అడవులలో జీవిస్తూ ప్రకృతి వైపరీత్యాలు, రోగాలను నివారించేందుకు పలు చెట్ల నుంచి తీసిన మూలికలను ఉపయోగించేవారని గుర్తుచేశారు.

- హైదరాబాద్ ఎన్ఐపీఈఆర్(జాతీయ ఫార్మసీ విద్య, పరిశోధనా సంస్థ) డీన్ ఎస్.శ్రీనివాస్ మాట్లాడుతూ మొక్కలు, జంతువులు, బ్యాక్టీరియాల నుంచి సహజ సిద్ధంగా లభించే కణాలతో మందులను శక్తివంతంగా తయారు చేసేందుకు సెమీ సింథటిక్ ప్రాసెస్‌ను ఉపయోగిస్తారని పేర్కొన్నారు. పలు రకాల క్యాన్సర్ నిరోధక మందులు శక్తివంతమైనవైనా అవి వాడిన వారిపై దుష్పరిణామాలు ఉంటున్నాయని పేర్కొన్నారు. పలు రకాల మందుల మాలిక్యూల్స్‌లోని ఫంక్షనల్ గ్రూపులను మార్పు చేయడం ద్వారా వాటి పనితీరును మార్చవచ్చని వివరించారు.
- ఐఐసీటీ శాస్త్రవేత్త డాక్టర్ కె.సురేష్‌బాబు మాట్లాడుతూ ఆధునిక మందుల రూపకల్పన, అభివృద్ధికి మొక్కల నుంచి సంగ్రహించే మూలకాలే ఆధారమన్నారు. అనంతరం ఏఎన్‌యూ రెక్టార్ ఆచార్య పి.వరప్రసాదమూర్తి, ఓఎస్‌డీ కె.సునీత, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రమీలారాణి, సదస్సు డైరెక్టర్ డాక్టర్ రవి, ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ టీఎస్ వీకేవీ ప్రసాద్ తదితరులు మాట్లాడారు. తర్వాత సదస్సులో సమర్పించే పరిశోధనా పత్రాల సావనీర్‌ను వీసీ ఆవిష్కరించారు. ఫార్మసీ కళాశాల అధ్యాపకులు డాక్టర్ రవిశంకర్ రెడ్డి, డాక్టర్ అన్నపూర్ణ, డాక్టర్ విజకిషోర్, డాక్టర్ సృజన, సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జాతీయ సదస్సుల బ్రోచర్ల ఆవిష్కరణ

ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో పలు విభాగాల ఆధ్వర్యంలో జరగనున్న జాతీయ సదస్సుల బ్రోచర్లను బుధవారం వీసీ పి.రాజశేఖర్ ఆవిష్కరించారు. యూనివర్సిటీ సోషియాలజీ, సోషల్ వర్క్ విభాగం ఆధ్వర్యంలో మార్చి 20, 21 తేదీలలో 'సామాజిక ఆరోగ్యం, సుస్థిరమైన అభివృద్ధి లక్ష్యాలు' అనే అంశంపై నిర్వహించే జాతీయ సదస్సుతోపాటు యూనివర్సిటీ మహాత్మా జ్యోతిరావ్ పూలే అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో మార్చి 10, 11 తేదీలలో, బయోటెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో ఈనెల 24, 25 తేదీలలో నిర్వహించనున్న జాతీయ సదస్సుల బ్రోచర్లనూ వీసీ ఆవిష్కరించారు.

బైక్ చోరీలకు పాల్పడుతున్న నిందితుడి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ సీతారామయ్య, పోలీసు సిబ్బంది

పట్నంబజారు: బైక్ చోరీలకు పాల్పడుతున్న నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపరిచారు. కొత్తపేట పోలీసుస్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈస్ట్ సబ్ డివిజన్ డీఎస్పీ బి.సీతారామయ్య, కొత్తపేట పీఎస్ ఎస్‌హెచ్‌ఓ శీలం శ్రీనివాసులరెడ్డి వివరాలను వెల్లడించారు. ఆయన కథనం ప్రకారం.. పల్నాడు జిల్లా చిలకలూరిపేటకు చెందిన సర్వేపల్లి అంకమ్మరావు మద్యానికి బానిసగా మారి సులువుగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో చోరీలు చేయటం ప్రారంభించాడు. గత నెల 31న కొత్తపేటలోని కుగ్లర్ ఆస్పత్రి వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న అంకమ్మరావును పోలీసులు అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో ప్రశ్నించారు. దీంతో ద్విచక్ర వాహనాల చోరీలకు పాల్పడుతున్నట్లు అంగీకరించాడు. సుమారు 10 రోజుల వ్యవధిలో 13 బైక్‌లు దొంగిలించాడు. వాటి విలువ రూ.9 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. గతంలోనూ చిలకలూరిపేట, సత్తెనపల్లి, గుంటూరు నగరంలో పలు ప్రాంతాల్లో 20 బైక్‌లు చోరీ చేసిన కేసులో అరెస్ట్ అయి జైలుశిక్ష అనుభవించి వచ్చిన తరువాత కూడా అంకమ్మరావు చోరీలకు పాల్పడుతున్నట్లు పోలీసులు వెల్లడించారు. నిందితుడిని పట్టుకోవటంలో ప్రతిభ కనబరిచిన సిబ్బందిని అభినందించారు. బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు.

9న స్పెల్‌బీ, 12న సూపర్ క్విజ్‌బీ పోటీలు



పోటీల బ్రోచర్లు విడుదల చేస్తున్న రాయపాటి శ్రీనివాస్, కృష్ణప్రసాద్, రథినీచౌదరి

గుంటూరు ఎడ్యుకేషన్: డాక్టర్ కేఎల్‌పీ పబ్లిక్ స్కూల్లో ఈనెల 9న జిల్లాస్థాయి స్పెల్‌బీ, 12న రాష్ట్రస్థాయి సూపర్ క్విజ్ బీ పోటీలు నిర్వహిస్తున్నట్లు పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ తెలిపారు. జేకేసీ కళాశాల రోడ్డులోని కేఎల్‌పీ స్కూల్లో బుధవారం పోటీలకు సంబంధించిన బ్రోచర్లను నాగార్జున ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, డాక్టర్ కృష్ణప్రసాద్ విడుదల చేశారు. విద్యార్థుల్లో పోటీతత్వాన్ని పెంపొందించి, ప్రజ్ఞావంతులుగా తీర్చిదిద్దడంలో పోటీలు దోహదం చేస్తాయన్నారు. ఈనెల 9వ తేదీన జరిగే స్పెల్ బీ పోటీల్లో సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ, స్టేట్ బోర్డు పాఠశాలల నుంచి 8,9,10 తరగతుల విద్యార్థులు పాల్గొనవచ్చని తెలిపారు. 12న రాష్ట్రస్థాయి సూపర్ క్విజ్ బీ పోటీలలో ఇదే విధంగా 8,9,10 తరగతులు చదువుతున్న విద్యార్థులు పాల్గొనాలని సూచించారు. విజేతలకు నగదు బహుమతులు అందజేస్తామని, ఇతర వివరాలకు 9948227362, 7013825972 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ వై.రథినీచౌదరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలి

నగరపాలక సంస్థ కమిషనర్ కీర్తి చేకూరి



కమిషనర్ కీర్తికి జ్ఞాపికను అందజేస్తున్న మాధవి, పక్కన కేఎస్ లక్ష్మణరావు తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థులు సైన్స్‌పై ఆసక్తి పెంచుకుని భావి శాస్త్రవేత్తలుగా ఎదగాలని నగర పాలక సంస్థ కమిషనర్ కీర్తి చేకూరి చెప్పారు. బుధవారం మార్కెట్ సెంటర్లోని హిందూ కళాశాలలో మూడు రోజులుగా జరుగుతున్న సైన్స్ ఎక్స్‌పో ముగింపు సందర్భంగా నిర్వహించిన బహుమతి ప్రదానోత్సవ సభలో ఆమె ముఖ్య అతిథిగా మాట్లాడుతూ సైన్స్ అభివృద్ధి చెందినప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. ఎన్నెన్నో విలువైన సైన్స్ ఆవిష్కరణలకు రూపమిచ్చిన శాస్త్రవేత్తలను భూమిపై మనుషులు ఉన్నంత కాలం గుర్తు పెట్టుకుంటారని, అందుకే శాస్త్రవేత్తలకు అంత విలువ ఉందని పేర్కొన్నారు. గుంటూరు నగరపాలక సంస్థకు సంబంధించి ఎన్నెన్నో సమస్యలకు పరిష్కారం కనుగొనాల్సి ఉందని, అందులో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ వ్యవస్థ ఒకటని, ఇలాంటి సమస్యలకు విద్యార్థులు ఏదైనా పరిష్కారమార్గం కనుగొంటే వారికి తగిన సహాయ సహకారాలు అందిస్తామని ప్రకటించారు. విద్యార్థులు కేవలం డాక్టర్లు, ఇంజనీర్లుగానేకాక శాస్త్రవేత్తలుగా ఎదిగి ప్రపంచానికి గుర్తుండిపోయే ఆవిష్కరణలను ప్రజల ముందుంచాలని ఆకాంక్షించారు. సభలో ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, కళాశాల కార్యదర్శి చెరువు రామకృష్ణమూర్తి, ప్రిన్సిపాల్ పీఎంప్రసాద్, డాక్టర్ మన్నవ రాధాకృష్ణ మూర్తి, సైన్స్ ఎక్స్‌పో కన్వీనర్ డాక్టర్ ఎం.మాధవి, వైస్ ప్రిన్సిపాల్ కేవీఎస్ దుర్గాప్రసాద్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ పోస్టు భర్తీ కోసం దరఖాస్తుల ఆహ్వానం

నెహ్రూనగర్: గుంటూరు జిల్లా తెనాలిలోని గిరిజన సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో ఖాళీగా ఉన్న ఒక ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ పోస్ట్ భర్తీకి మహిళా అభ్యర్థుల నుంచి మాత్రమే దరఖాస్తులు స్వీకరించనున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ వి.బాబుల నాయక్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియెట్‌లో 50 శాతం మార్కులు సాధించడంతోపాటు, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్‌లో టీటీసీ పూర్తి చేసి ఉండాలని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థినులు తమ దరఖాస్తులను జిల్లా గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయంలో ఈ నెల 5వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు అందజేయాలని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 83281 59776 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ఆరోగ్యశ్రీతో వెన్నెదన్ను

- కోత, కుట్లు లేకుండా స్పయిన్ శస్త్రచికిత్సలు
- ఒకేరోజు లైవ్‌లో ఎనిమిది మందికి ఆపరేషన్లు
- ప్రముఖ స్పయిన్ సర్జన్ డాక్టర్ నరేష్‌బాబు



ఆపరేషన్ చేయించుకున్న వారితో స్పయిన్ సర్జన్ డాక్టర్ నరేష్‌బాబు

గుంటూరు మెడికల్: వెన్నెముక సమస్యలతో బాధపడుతున్న ఎనిమిది మందికి ఒకేరోజు లైవ్ సర్జరీలు చేసినట్టు మల్లిక స్పయిన్ సెంటర్ అధినేత, సీనియర్ స్పయిన్ సర్జన్ డాక్టర్ జె.నరేష్ బాబు చెప్పారు. బుధవారం స్థానిక కొత్తపేట ఓల్డ్ క్లబ్ రోడ్డులోని ఆస్పత్రిలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఏపీ స్పయిన్ సర్జన్స్ సొసైటీ ఏర్పడి ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా జనవరి 28న ఒకేరోజు ఎనిమిది మందికి లైవ్‌లో వెన్నెముక శస్త్రచికిత్సలు చేశామన్నారు. ఏపీలోగానీ ఇతర రాష్ట్రాల్లో గానీ ఒకేరోజు ఎనిమిది మందికి లైవ్‌లో సర్జరీలు చేస్తూ యువ వైద్యులకు మెలకువలు నేర్పిన దాఖలాలు లేవని పేర్కొన్నారు. వీరిలో ఆరుగురికి డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఉచితంగా అత్యాధునిక వైద్య పద్ధతుల్లో ఆపరేషన్లు చేశామన్నారు. సుమారు రెండు లక్షల ఖరీదు చేసే ఆపరేషన్లు ఉచితంగా చేశామని తెలిపారు. కడపకు చెందిన 26 ఏళ్ల జి.లక్ష్మీరెడ్డమ్మ, తూర్పు గోదావరి జిల్లాకు చెందిన 54 ఏళ్ల ఎం.వీరవెంకట సత్యవతి, 50 ఏళ్ల ఎస్.రవి, పల్నాడు జిల్లా గురజాలకు చెందిన 63 ఏళ్ల ఎం.నాగేశ్వరరావు, 51 ఏళ్ల సయ్యద్ రజాక్, శ్రీశైలానికి చెందిన 27 ఏళ్ల డాక్టర్ షాహీర్‌కు ఆరోగ్యశ్రీ ద్వారా ఉచిత ఆపరేషన్లు చేసినట్టు వెల్లడించారు. వెన్నెపూస వదులైన వారికి ఓపెన్ చేయకుండానే చర్మం ద్వారానే స్క్రూలు వేసి ఆపరేషన్ చేశామని, వయస్సు రీత్యా ఎనస్థీషియా ఇచ్చే సమయంలో మత్తును తట్టుకోలేని వృద్ధుడికి రోగి మెలకువగా ఉండగానే వెన్నెముక సర్జరీ చేశామన్నారు. నడుంలో జారిన డిస్క్‌లకు కోత, కుట్లు లేకుండా చిన్నగాటు ద్వారా ఎండోస్కోపిక్ డిస్క్ సర్జరీ విజయవంతంగా చేశామని వెల్లడించారు. లైవ్ సర్జరీల ప్రక్రియలో తనతోపాటు దేశంలోని పలు రాష్ట్రాల సీనియర్ స్పయిన్ సర్జన్స్ డాక్టర్ రంజిత్, డాక్టర్ ప్రమోద్, డాక్టర్ ఉమేష్, డాక్టర్ అజేయ్, డాక్టర్ విశాల్, మత్తు వైద్యులు డాక్టర్ టీవీ రావు, డాక్టర్ దరియా హుస్సేన్ పాల్గొన్నట్లు తెలిపారు. లైవ్ ఆపరేషన్లు విజయవంతం కావటంతో రోగులను బుధవారం ఆస్పత్రి నుంచి డిశ్చార్జి చేస్తున్నామన్నారు. ప్రజలు స్పయిన్ సర్జరీలపై అపోహలు వీడి అందుబాటులో అత్యాధునిక సదుపాయాన్ని వినియోగించుకుని వెన్నెముక సమస్యలను తొలగించుకోవాలని కోరారు.

3, 4వ తేదీల్లో జాతీయస్థాయి మూట్ కోర్టు పోటీలు

గుంటూరు ఎడ్యుకేషన్: జాగర్లమూడి చంద్రమౌళి న్యాయ (జేసీ లా) కళాశాల మూట్ సొసైటీ ఆధ్వర్యంలో ఈనెల 3,4వ తేదీల్లో జాతీయస్థాయి మూట్ కోర్టు పోటీలను నిర్వహిస్తున్నట్లు కళాశాల కార్యదర్శి వేమన కుప్పుస్వామి తెలిపారు. జేకేసీ కళాశాలరోడ్డులోని జేసీ లా కళాశాలలో బుధవారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టినేని సుధాకర్‌బాబు, విద్యార్థులో కలిసి మూట్ కోర్టు పోటీల బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోని ప్రముఖ న్యాయ విద్యాసంస్థలకు చెందిన 32 జట్లు హాజరవుతుండగా, వీటిలో ఏపీ నుంచి ఏడు, తెలంగాణ నుంచి రెండు జట్లు పోటీల్లో పాల్గొంటున్నాయని తెలిపారు. ప్రారంభ కార్యక్రమానికి రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య కె.హేమచంద్రారెడ్డి, ముగింపు కార్యక్రమానికి బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాలో ఏపీ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఎ.రామిరెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొననున్నారని వివరించారు. ముంబై, పూణె, బెంగుళూరు, గోవా, లక్నో, గుంటూరులోని విద్యాసంస్థల్లో నిర్వహించిన మూట్ కోర్టు పోటీల్లో పాల్గొన్న తమ కళాశాల విద్యార్థులు ఆరు బహుమతులను గెలుపొందినట్లు తెలిపారు.